నమస్తే తెలంగాణ
# నాగర్‌కర్నూల్
5 | మహబూబ్‌నగర్, మంగళవారం 13 ఆగస్టు 2024 | NAGARKURNOOL



నాగర్‌కర్నూల్‌లో హత్యకు గురైన ట్రైనీ డాక్టర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైద్య విద్యార్థులు

వెస్ట్ బెంగాల్‌లోని కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్ హత్యాచారానికి నిరసనగా సోమవారం వైద్య విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ తోపాటు పలు ప్రాంతాల్లో క్యాండిల్ ర్యాలీ చేపట్టి నివాళు లర్పించారు. హత్యకు కారణమైన నిందితుడిని పట్టుకొని కఠినంగా శిక్షించాలని నినదించారు. ఈ సందర్భంగా పలువురు జూనియర్ వైద్యులు మాట్లాడుతూ డాక్టర్లపై దాడులు జరగకుండా ప్రభుత్వాలు రక్షణ కల్పించాలని కోరారు.





## జోగుళాంబ సన్నిధిలో సినీ ప్రముఖులు

అలంపూర్, ఆగస్టు 12 : దక్షిణకాశిగా ప్రసిద్ధిగాంచిన జోగుళాంబ, బాల బ్రహ్మేశ్వరస్వామి ఆలయాలను ప్రముఖులు దర్శించుకున్నారు. సోమవారం ప్రముఖ సినీ దర్శకుడు హరీశ్ శంకర్, యాంకర్ సుమ, నిర్మాత టీజీ విశ్వప్రసాద్ ఉభయ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఈవో పురేందర్‌కుమార్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి తీర్థప్రాదాలు అందజేశారు.



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ కార్యాలయం

# దుకాణం ఒకరిది.. వ్యాపారం మరొకరిది..

- టెండర్లలో దక్కించుకొని దుకాణాలను అద్దెకిచ్చిన వైనం
- రిజర్వేషన్ల కేటగిరిలో బడాబాబుల సొంతం
- పాలమూరులో సబ్‌లీజు దందా
- మున్సిపాలిటీకి నెలకు రూ.9వేలు చెల్లిస్తూ.. రూ.30వేల ఆదాయం
- బల్దియాలో పేరుకుపోయిన బకాయిలు రూ.26కోట్లు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, ఆగస్టు 12 : మహబూబ్‌నగర్ మున్సిపాలిటీకి చెందిన అద్దె వ్యవహారంలో బినామీల దందా కొనసాగుతున్నది. రాజకీయ పలుకుబడి ఉన్న కొందరు అధికారులతో కుమ్మక్కై మున్సిపల్ ఖజానాకు గండి కొడుతున్నారు. తక్కువ అద్దెకు దుకాణలను తీసుకొని అధిక అద్దెలకు వ్యాపారులకు ఇచ్చి ఏటా రూ.లక్షల ఆదాయం పొందుతున్నారు. కొందరు వ్యాపారులు రెండు, మూడేండ్లుగా దుకాణాలకు అద్దెలు చెల్లించకపోయినా అడిగే నాథుడు కరవయ్యాడు. వారిపై పురపాలిక అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అధికారుల నిర్వాకంతో ఇటు పేద వ్యాపారులకు, అటు పురపాలిక ఆదాయానికి నష్టం జరుగుతున్నది.

**ఆదాయం సమకూర్చుకునేందుకు..**

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ ఆదాయ వనరుల కోసం జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్, మార్కెట్, న్యూటౌన్, పద్మావతి కాలనీ, తదితర ప్రాంతాల్లో పలు చోట్ల ఇరువైపులా వందలాదిగా దుకాణాలు నిర్మించారు. ఇవన్నీ ప్రధాన రహదారి వెంట వ్యాపారాలకు అనుకూలంగా కట్టించినవే. దుకాణాల కొలతల ఆధారంగా వాటికి అద్దెలను ఖరారు చేశారు. ప్రైవేట్ దుకాణాలతో పోలిస్తే వీటి అద్దె చాలా తక్కువగానే ఉంది. మున్సిపల్ అద్దె దుకాణాలకు సరాసరి రూ.5వేల నుంచి 12వేల వరకు అద్దె నిర్ణయించారు.

**మున్సిపల్ ఆదాయానికి గండి..**

మున్సిపాలిటీ పరిధిలోని అద్దె దుకాణాల రిజర్వేషన్ టెండర్ల ద్వారా కేటాయిస్తారు. నిరుపేదలు, నిరుద్యోగుల జీవనోపాధి పెంపులో భాగంగా కేటాయించే ఈ దుకాణాలను కొందరు బడాబాబులు సైతం రిజర్వేషన్ కేటగిరిలో పొందడం విడ్డూరం. దుకాణాలను తమ పేరిట పొందిన వారు సబ్ లీజుకు ఇచ్చి అక్రమంగా ఆదాయం ఆర్జిస్తున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోనే అత్యంత ప్రసిద్ధిగాంచిన ఓ పేరు మోసిన డాక్టర్ తన పేరిట దుకాణం పొంది దాన్ని సబ్‌లీజుకు రూ.40 వేలకు పైబడి ఇస్తూ.. మున్సిపాలిటీకి మాత్రం రూ.9 నుంచి రూ.12వేలు మాత్రమే చెల్లిస్తున్నాడు. మున్సిపల్ అధికారులకు ఈ విషయం తెలిసినా.. అద్దె ఠంఛన్‌గా చెల్లిస్తున్నారు.. లేనిపోని తంటాలు మాకెందుకు.? అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇలా చాలా మంది బడాబాబులు తాము పొందిన దుకాణాలను సబ్‌లీజుకు ఇచ్చి ఆదాయం పొందుతుండటం విశేషం. దుకాణాలు పొందిన వారిలో 50శాతం మంది ఒక్కో దుకాణాన్ని రూ.12 నుంచి రూ.15వేలకు దక్కించుకున్న వ్యక్తులు.. బినామీలకు ఒక్కోదానిని రూ.30 నుంచి రూ.40వేలకు పైగా అద్దెకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారు. ఇంకొందరు దుకాణాలు దక్కించుకున్న యజమానులు బినామీలకు అద్దె ఇస్తూ అదనంగా రూ.కోట్లు దండుకుంటున్నారు.

**గెజిట్ ఏం చెబుతుందంటే..**

మున్సిపల్ గెజిట్ ప్రకారం షాపులను ఎవరైతే వేలంలో దక్కించుకున్నారో వారే వ్యాపారం చేయాలి. అదేవిధంగా దుకాణంలో మద్యం, మాంసం వ్యాపారాలు నిర్వహించకూడదు. దుకాణాలను ఇతరులకు లీజుకివ్వకూడదు. సబ్ లీజ్ పేరిట ఒప్పందం చేసుకునేందుకు వీలు లేదు. కానీ మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ దుకాణాల్లో సగం మంది బినామీలు వ్యాపారం చేస్తున్నారు. దుకాణం దక్కించుకున్న యజమాని మున్సిపాలిటీకి చెల్లించాల్సిన అద్దె చెల్లిస్తారు. బినామీలకు రెండింతలు, మూడింతలు ఎక్కువగా అద్దెకు ఇస్తూ మిగిలిన ఆదాయాన్ని జేబులో వేసుకొంటున్నారు. ఇంకొందరు బకాయిలు పేరుకుపోగానే దుకాణాలకు తాళాలు వేసి ముఖం చాటేస్తున్నారు.

**అద్దె బకాయిలు రూ.26కోట్లు..**

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 220దుకాణాలకు గానూ ఇప్పటి వరకు రూ.26కోట్లు అద్దె బకాయిలు ఉన్నాయి. కొన్ని దుకాణాల అద్దె బకాయిలు పరిశీలిస్తే న్యూటౌన్‌లోని ఓ దుకాణం రూ.56,16,000లు బకాయి ఉండటం విశేషం. మరో దుకాణం రూ.4,06,916లు చెల్లించాల్సి ఉండగా, ఇంకో దుకాణం రూ.5,73,344లు చెల్లించాల్సి ఉంది. ఈ స్థాయిలో బకాయిలు పేరుకు పోతున్నా.. సంబంధిత అధికారులు ఏ మాత్రం పట్టించుకోకపోవడం విడ్డూరం అని చెప్పవచ్చు. ఈ నేపథ్యంలోనే ఈ నెలాఖరు నాటికి అద్దెలు వసూలు చేయాలంటూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వీటిపై మున్సిపల్ అధికారులు ఆయా దుకాణాదారులకు నోటీసులు జారీ చేస్తున్నారు. ఈ విషయంపై మున్సిపల్ రెవెన్యూ అధికారులను సంప్రదించగా.. నెలాఖరులోగా అద్దె చెల్లించకపోతే టెండరు రద్దు చేసి దుకాణాలు ఖాళీ చేయించి ఇతరులకు కేటాయిస్తామని తెలిపారు.

# బడుగుల ఆశాజ్యోతి ఎర్ర సత్యం



ఎర్రసత్యం విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ అర్బన్, ఆగస్టు 12 : బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, బీసీ కులాల ముద్దుబిడ్డ ఎర్ర సత్యం అని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఎర్ర సత్యం వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాజీ మంత్రి మాట్లాడుతూ బలహీన వర్గాల కోసం నిరంతరం శ్రమించిన నాయకుడని, ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, డీసీసీ వైస్‌చైర్మన్ వెంకటయ్య, నేతలు గణేశ్, శివరాజ్, గోపాల్‌యాదవ్, రామకృష్ణ, నవకాంత్, మాజీ ఎంపీపీ బాలరాజు, శ్రీనివాస్‌రెడ్డి, శివ, సుధాకర్ పాల్గొన్నారు.

# ఆడబిడ్డలకు కల్యాణలక్ష్మి గొప్పవరం

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అయిజ, ఆగస్టు 12 : పేదింటి ఆడబిడ్డల పెండ్లిళ్లకు ప్రభుత్వం అందజేస్తున్న కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు గొప్ప వరమని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అన్నారు. సోమవారం పట్టణంలోని తాసీల్దార్ కార్యాలయ ఆవరణలో అయిజ మున్సిపాలిటీ తోపాటు మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మంది నిరుపేదలు ఆడబిడ్డల పెండ్లిళ్లు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాన్ని తీసుకొచ్చి వారిని ఆదుకున్నదని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం అర్హులకు వెనువెంటనే చెక్కులు అందజేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దేవ న్న, వైస్ చైర్మన్ నర్సింహులు, తాసీల్దార్ జ్యోతి, ఆర్‌ఐ మద్దిలేటి, కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# రుణమాఫీలో చేతివాటం

- వడ్డీ పేరుతో రైతులను మోసం చేస్తున్న పీఏసీసీఎస్ సిబ్బంది
- రుణాలు లేని వారికి రుణమాఫీ లిస్టులో పేర్లు
- క్లియరెన్స్ అయినా రైతులకు అందని పాసుపుస్తకాలు
- కొత్త రుణాలకు ఎదురుచూపులు



గండీడ్ పీఏసీసీఎస్ వద్ద రైతులు

మహ్మదాబాద్, ఆగస్టు 12 : ఉమ్మడి గండీడ్ మండలంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నుంచి అనేక మంది రైతులు రుణాలు పొందారు. ఇటీవలే ప్రభుత్వం ప్రకటించిన రూ.రెండు లక్షల రుణమాఫీలో రెండు విడుతల్లో రుణమాఫీ అయిన రైతుల నుంచి వడ్డీ పేరుతో వేలాది రూపాయలు కట్టించుకొని పేద రైతుల నడ్డి విరుస్తున్నారు. లోన్ స్టేట్‌మెంట్ ప్రకారం ఒక రైతు రుణమాఫీ అయిన తర్వాత రూ.1500 డివ్ చెల్లించాల్సి ఉండగా అతని దగ్గర నుంచి రూ.15 వేలు కట్టించున్నారు. అయితే రైతులు రుణమాఫీ వచ్చిందనే సంతోషంలో పీఏసీసీఎస్ సిబ్బంది అడిగినంత కట్టి వెళ్లిపోతున్నారు. అసలు రుణం తీసుకోని రైతులకు రుణమాఫీ అయ్యిందని మెసేజ్ రావడంతోపాటు మీరు ఇంత వడ్డీ చెల్లించి ఎన్‌వోసీ తీసుకోవాలని పీఏసీసీఎస్ సిబ్బంది ఒత్తిడి చేస్తున్నారు. దీంతో సదరు రైతులు సోమవారం కార్యాలయానికి వచ్చి మేము రుణాలే తీసుకోలేదని, ఎందుకు వడ్డీ చెల్లించాలని సిబ్బందిని నిలదీశారు. తాము రుణాలు తీసుకోకున్నా ఫోర్జరీ సంతకాలు చేసి సిబ్బంది తమ పేర్లు మీద రుణాలు తీసుకొని డబ్బులు కాజేసి ఇప్పుడు రుణమాఫీ అయ్యింది, వడ్డీ చెల్లించాలని ఫోన్లు చేస్తున్నారని మండిపడుతున్నారు. సోమవారం కొంతమంది రైతులు లోన్ స్టేట్‌మెంట్ తీసుకొని మిగతా వడ్డీ చెల్లించడానికి వెళ్లగా తెలియని వారి దగ్గర రూ.వెయ్యి నుంచి రూ.20వేల వరకు తెలిసిన వారి నుంచి రూ.500నుంచి వెయ్యి రూపాయలు వసూలు చేశారు. ఇలా అదనంగా డబ్బులు తీసుకొని రశీదు ఇచ్చి కంప్యూటర్‌లో పొందుపర్చకపోవడంతో రైతుల్లో అనుమానం వచ్చి సిబ్బందిని నిలదీశారు. మేముకట్టిన ప్రతి రూపాయికి మీరు లెక్క చెప్పాల్సిందే.. మాతో కట్టించుకున్న డబ్బులు ఆన్‌లైన్‌లో పొందుపర్చి క్లియరెన్స్ ఇచ్చి పాసు పుస్తకాలు ఇవ్వాలని, కొత్త రుణాలు ఎప్పుడిస్తారో చెప్పాలని రైతులు సిబ్బందిని నిలదీశారు. అదేవిధంగా పీఏసీసీఎస్ సిబ్బంది చేస్తున్న మోసాలను సోమవారం గండీడ్‌కు వచ్చిన ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సైతం రైతులు వివరించారు. దీంతో ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

### రైతులు ఆందోళన చెందొద్దు



పీఏసీసీఎస్‌లో రైతులకు అన్యాయం జరగనివ్వం. ప్రతి రైతుకు న్యాయం చేస్తాం, ఎవరూ ఆందోళన చెందవద్దు. డబ్బులు ఎందుకు ఎక్కువ వసూలు చేశారో తెలుసుకొని సదరు సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం. రుణాలు క్లియర్ అయిన వారందరికీ పాసు పుస్తకాలు ఇప్పిస్తామని, కొత్త రుణాలు కూడా త్వరలో అందజేస్తాం.

– లక్ష్మీనారాయణ, పీఏసీసీఎస్ చైర్మన్

# ఉన్ని పరిశ్రమ అభివృద్ధి చెందాలి

- హ్యాండ్లూమ్ టెక్స్‌టైల్స్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్



మగ్గాలను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ

నారాయణపేట/మద్దూర్ (కోస్గి) ఆగస్టు 12 : నారాయణపేట జిల్లాలో ఉన్ని పరిశ్రమ మరింత అభివృద్ధి చెందాలని తెలంగాణ రాష్ట్ర హ్యాండ్లూమ్ టెక్స్‌టైల్స్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్ అన్నారు. సోమవారం కోస్గి మండలంలోని ఉన్ని పారిశ్రామిక సహకార సంఘం మగ్గాలను కలెక్టర్ సిక్తా పట్నాయక్‌తో కలిసి ఆమె పరిశీలించారు. ఉన్ని తయారు చేశాక వాటి అమ్మకాలు ఎక్కడ జరుపుతారని కార్మికులను అడుగగా సరైన గిట్టుబాటు ధర రావడం లేదని కార్మికులు వివరించారు. గతంలో పాత సొసైటీలకు ఉన్న అప్పులను తాసీల్దార్, ఏడీ ఆధ్వర్యంలో వసూలు చేయాలని సూచించారు. అనంతరం నారాయణపేటలోని స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌లో నిర్మిస్తున్న కామన్ ఫెసిలిటీ సెంటర్ హ్యాండ్లూమ్ నిర్మాణ పనులను పరిశీలించి మూడు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు.

# రోజుకు 30మందికే మాఫీ డబ్బులు

- జిన్నారం ఏపీజీవీబీ ఎదుట రైతుల క్యూ





ఏపీజీవీబీ వద్ద బారులుదీరిన రైతులు

మరికల్, ఆగస్టు 12 : మండలంలోని జిన్నారం ఏపీజీవీబీలో రోజుకు 30మందికే రుణమాఫీ డబ్బులు చెల్లిస్తారని, ఈ మేరకే బ్యాంకు అధికారులు టోకెన్లు ఇస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం జిన్నారం ఏపీజీవీబీకి సుమారు 300మంది రైతులు రాగా పోలీసుల సహకారంతో బ్యాంకు అధికారులు మూడు రోజుల టోకెన్లు ఇచ్చారని, మిగతా వారిని తర్వాత రావాలని చెప్పిపంపించారు. దీంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అకౌంట్లలో రుణమాఫీ డబ్బులు వేస్తే బ్యాంకు అధికారులు వాటిని ఇవ్వడానికి తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులైన స్పందించి రుణమాఫీ డబ్బులు అందరికీ అందించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

| జిల్లా | కుక్కలు | ఆర్నెళ్లలో కాట్లు | ఆపరేషన్లు చేసినవి |
|---|---|---|---|
| పాలమూరు | 10,000 | 1,575 | 5,200 |
| జోగుళాంబ గద్వాల | 8,800 | 70 | 320 |
| వనపర్తి | 15,000 | 1,797 | 17 |
| నారాయణపేట | 9,500 | 911 | -- |
| నాగర్‌కర్నూల్ | 20,000 | 4,468 | 00 |

# భౌబోయ్!

- తెగబడుతున్న వీధి కుక్కలు
- రోజురోజుకూ పెరిగిన దాడులు
- దవాఖానలకు బాధితుల క్యూ
- బయటకు రావాలంటేనే భయం
- కాటుకు గురవుతున్న పిల్లలు
- కానరాని వీధి కుక్కల నియంత్రణ
- భయాందోళనల్లో ఉమ్మడి జిల్లావాసులు



జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం బిజ్వారంలో గుంపులుగా గ్రామ సింహాలు

గ్రామ సింహాలు స్వైరవిహారం చేస్తున్నాయి. పల్లె, పట్నం అన్న తేడా లేకుండా వీటి బెడద తీవ్రమైంది. ఇండ్ల నుంచి వీధిల్లోకి రావాలన్నా తడబాటే.. బైక్‌పై వెళ్తున్నప్పుడు కంగారు.. పిల్లలను పనుల మీద బయటకు పంపించాలన్నా భయం.. భయం. చిన్నారులు ఇంటి ముందు సరదాగా ఆడుకోవాలన్నా ఆందోళన తప్పడం లేదు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని, ఏ కుక్క ఎక్కడి నుంచి దాడికి తెగబడి ప్రాణాలు తీస్తుందేమోనన్న భయం నెలకొన్నది. ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలువురు చిన్నారుల తోపాటు పెద్దవారు కుక్క కాటుకు గురయ్యారు. అయినా వీధి కుక్కల నియంత్రణకు అధికారులు తీసుకుంటున్న చర్యలు కరువయ్యాయన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది.

*– నాగర్‌కర్నూల్/వనపర్తి(నమస్తే తెలంగాణ)/గద్వాల/నారాయణపేట, ఆగస్టు 12*

### గుంపులు గుంపులుగా..

మహబూబ్‌నగర్, ఆగస్టు 12 : పాలమూరు జిల్లాలో వీధి కుక్కలు రెచ్చిపోతున్నాయి. పాదచారులు, వీధుల్లోని ఇండ్ల ఎదుట ఆడుకుంటున్న చిన్నారులపై దాడులకు తెగబడుతున్నాయి. వీధుల్లో తిరుగుతూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. దీంతో స్థానికులు ప్రజాప్రతినిధులు, అధికారులకు మొరపెట్టుకుంటున్నారు. మహబూబ్‌నగర్ జనరల్ దవాఖానలో గుంపులు.. గుంపులుగా సంచరిస్తున్నాయి. దీంతో వైద్యశాలకు వచ్చే రోగులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల జిల్లా కేంద్రంలోని ఎర్రమన్నుగుట్ట పరిధిలోని హరిజనతండాకు చెందిన చిన్నారి భవాని(6) కుక్క దాడిలో తీవ్రంగా గాయపడింది. ఇంటి ఆవరణలో సోదరుడితో కలిసి ఆడుకుంటుండగా.. వీధి కుక్కలు దాడి చేశాయి.

గ్రామ సింహాలు.. ఇంటికి నమ్మకస్తుడిగా ముద్రపడిన ఈ పేరు వింటే ప్రజలు ప్రస్తుతం కంగారు పడే పరిస్థితులు నెలకొన్నాయి. కాలనీల్లో నివాస ప్రాంతాల నుంచి ప్రధాన రహదారులపైకి గుంపులు గుంపులుగా వచ్చేస్తున్న ఈ వీధి కుక్కలతో ప్రజలకు ప్రాణాపాయం కలుగుతోంది. ఈ ప్రమాదకర వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాల్సిన ఆయా శాఖల అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఫలితంగా ఊరూరా ఏటేటా కుక్కకాట్ల బాధితులు పెరిగిపోతున్నారు.

**రోడ్లపై స్వైరవిహారం..**

గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు వీధి కుక్కలు చుక్కలు చూపిస్తున్నాయి. ఇంటికి రక్షణగా నమ్మకమైన జంతువుగా వీటి పేరుంది. అలాంటి ఇంట్లో పెంపుడు కుక్కలను మినహాయిస్తే వీధి కుక్కల స్వైర విహారం ఇటీవలి కాలంలో పెరిగింది. గ్రామాల్లో, పట్టణాల్లో ఎక్కడ చూసినా గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. పట్టణాల్లో కుక్కల గుంపులు చికాకు కలిగిస్తున్నాయి. ప్రధాన రహదారుల వెంట తిరుగుతూ బైక్ వాహనదారులకు, కార్లకూ ఇబ్బంది కలిగిస్తున్నాయి. రెండు నెలల కిందట నాగర్‌కర్నూల్ జిల్లాలో ఓ ద్విచక్ర వాహనదారుడు కుక్క ఎదురుగా వచ్చి మృత్యువాత పడ్డాడు. దీనికి కారణం పట్టణాల్లో మాంస విక్రయదారులు, హోటళ్లు, రెస్టారెంట్లు, మున్సిపాల్టీ సిబ్బంది నిర్లక్ష్యమే అన్న విషయం స్పష్టమవుతోంది. రోడ్లపై చేపలు, మాంసం విక్రయాలు చేపడుతుండటంతో ఆ వ్యర్థాల కోసం కుక్కలు అక్కడే తిరుగాడుతున్నాయి. మాంసం తీసుకెళ్లేందుకు వచ్చే ప్రజలూ వీటిని చూసి భయపడుతున్నారు. కొందరు మున్సిపాల్టీ సిబ్బంది చెత్తను డంపింగ్ యార్డులకు బదులుగా పట్టణ శివారు ప్రాంతాల్లో పారవేస్తున్నారు. అలాగే హోటల్, రెస్టారెంట్ల వ్యాపారులు కూడా పాడైన ఆహార వ్యర్థాలను విసిరేస్తున్నారు. ఈ చెత్తలోని కుళ్లిన ఆహార వ్యర్థాలను తినేందుకు శునకాలు పోటీ పడుతున్నాయి. ఒకదానిపై మరొకటి, ఒక గుంపు, మరో గుంపు కుక్కలుగా పోట్లాడుతున్నాయి. ఈ క్రమంలో అటుగా వెళ్లే ప్రజలు, వాహనదారులు భయంతో పరిసరాలను దాటుతున్నారు. పలు చోట్ల కుక్కలు పిల్లలు, మహిళలు, వృద్ధులపై దాడులు చేస్తున్న సంఘటనలు ప్రజలను భయ కంపితులను చేస్తున్నాయి.

**నియంత్రణ చర్యలేవీ..?**



నాగర్‌కర్నూల్‌లో నిరుపయోగంగా వీధి కుక్కల సంరక్షణ కేంద్రం

ఏ కుక్క ఎటువైపు నుంచి వచ్చి కరుస్తుందో..? అన్నట్లుగా వీటి సంఖ్య పెరుగుతూనే వస్తోంది. అయినా వీధి కుక్కలను నియంత్రించేందుకు మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం కుక్కల సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేసింది. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో పూర్తయినా ఉపయోగించడం లేదు. మిగిలిన చాలా చోట్ల ఈ భవనాల నిర్మాణాలు చేపట్టలేదు. వీధి కుక్కలను ఈ కుక్కల సంరక్షణ కేంద్రాలకు తరలించి మున్సిపల్, పంచాయతీ అధికారులు, పశుసంవర్ధక శాఖ సిబ్బందితో శస్త్ర చికిత్సలు, ముందస్తుగా కుక్కలకు వ్యాక్సిన్ చేయించాల్సి ఉంది. ఈ దిశగా ఎలాంటి కార్యాచరణ కనిపించడం లేదని ప్రజల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**అధికమవుతున్న కుక్క కాట్లు**

నాగర్‌కర్నూల్ జిల్లాలో కుక్కకాటు బాధితుల సంఖ్య ప్రతి సంవత్సరం పెరుగుతూ వస్తోంది. 2021లో 558 మంది, 2022లో 912 మంది, 2023లో 1,255 మంది కుక్క కాట్ల బాధితులుగా మారారు. ఈ సారి ఇప్పటి వరకు ఏకంగా 1,743 మంది గాయపడ్డారు. ఈ మేరకు వీధి కుక్కల స్వైర విహారం, వీటితో కలుగుతున్న ఇబ్బందులు స్పష్టమవుతున్నాయి. కాటుకు గురైన బాధితులు, కుటుంబీకుల్లో ఆందోళన నెలకొంటుంది. వీధి కుక్కల నియంత్రణపై జిల్లా అధికార యంత్రాంగం కదిలితేనే పూర్తి స్థాయిలో పరిస్థితి అదుపులోకి వచ్చే అవకాశముంది.



### చర్యలు తీసుకుంటాం

వీధి కుక్కల నియంత్రణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటాం. కుక్కల సంరక్షణ కేంద్రంలో రూ. 15 లక్షల విలువైన పరికరాలు కావాల్సి ఉంది. ఏఈ బదిలీపై వెళ్లారు. కొత్తగా వచ్చిన వెంటనే ఎస్టిమేషన్ చేయించి పరికరాలు తెప్పిస్తాం. పశువైద్యాధికారి నియామకం కావాల్సి ఉంది. వీధి కుక్కలు రోడ్ల వెంట తిరుగకుండా చూస్తాం. మాంసం, చికెన్ వ్యాపారులు, హోటళ్ల నిర్వాహకులు వ్యర్థాలను బయటపడేయకుండా ఇప్పటికే ఆదేశాలు జారీ చేశాం. ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటాం.

- నరేశ్‌బాబు, మున్సిపల్ కమిషనర్, నాగర్‌కర్నూల్

